www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 04 | జూన్ | 2026
పేజీలు : 8

# ఎట్టకేలకు ఎన్నెస్పి భూముల సర్వే


అధికారుల మౌనానికి అర్థమేమిటి..?

-ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో సంపన్నులు, అధికారులు
-ఫెన్సింగ్ తొలగించి మరి ఆక్రమణ
-లక్షలు చేతులు మారుతున్న వైనం
-అధికారులపై ఒత్తిడి తెస్తున్నది ఎవరు..?



**-ప్రజాపక్షం కథనాలకు స్పందన**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి కాలువ కట్టల ఆక్రమణకు సంబంధించి సర్వే ప్రారంభమైంది. ఖమ్మం నగరంలోని 12వ డివిజన్‌లో సాగర్ కాలువ కట్టలను కొంత మంది అక్రమించి వ్యాపార సముదాయాలను నిర్మించడం, నివాస స్థలాలుగా మార్చుకునేందుకు ప్రహారీ గోడలు నిర్మించిన నేపథ్యంలో ప్రజాపక్షం వరుస కథనాలను ప్రచురించింది. 66 అడుగుల వెడల్పు గల ఈ ఎన్నెస్పి మిగతా 2లో..

# దర్గాగా ప్రభుత్వ స్థలాల కబ్జా..!



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 23వ వార్డులోని ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వం మారిన ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూస్తుండటం మిగతా 2లో..

- బేస్‌మెట్లను కూల్చి ఆక్రమించుకుంటున్న వైనం
- స్థలానికి రూ. 1లక్ష వసూలు చేస్తున్న స్థానిక నాయకులు
- 3వ వార్డు షాడో హస్తం ఉన్నట్లు ఆరోపణలు..?

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై

# దృష్టిపెట్టాలి

-నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలి
-పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు
-మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల

2లో




## ధరల నియంత్రణలో

# కేంద్రం విఫలం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశంలో నిత్యవసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, మోడి సర్కార్ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ సామాన్యుల నడ్డి విరుస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మిగతా 2లో..

-10న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలి
- ఎంఎల్‌ఏ కూనంనేని కృషితో అభివృద్ధి వైపు అడుగులు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

## యూరియా యాప్‌ను

# రద్దు చేయండి




-కాంప్లెక్స్ ధరలను తగ్గించండి
-రైతు భరోసా పూర్తిస్థాయిలో జమ చేయండి
-రైతు సంఘం సమావేశంలో బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** యాప్ ద్వారా యూరియా పంచే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతులు యాప్ ద్వారా యూరియా పొందెందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. మిడికంటి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారుల అంచనాల మేరకు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు గతేడాది తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మిగతా 2లో..

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిపెట్టాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎంఎల్ఎలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు సంస్థలు ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజీ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించనున్నట్లు తెలిపారు. తక్కువ నీరు అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మార్కెట్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయలేదని తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ధాన్యం కొనుగోలు కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పలు కారణాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయన్నారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపడడంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. రైతులు ఉద్యాన పంటలు కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వంట నూనెలు, పప్పు ధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధారపడుతున్నామని ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిపెట్టాలన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశంలో అగ్ర స్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగు విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. పత్తి దేశంలో పెద్ద ఎత్తున సాగవుతున్న విదేశాల నుంచి దిగుమతి చేయడం రైతులకు నష్టం కలిగిస్తుందన్నారు. ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల దేశంలోని రైతులు నష్టపోతున్నారన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన స్పందన లేదన్నారు. పురుగు మందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్ భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలన్నారు. యూరియా ధర తక్కువ ఉండడం , కాంప్లెక్స్ ధరలు ఎక్కువగా ఉండడం కూడా రైతులు యూరియా వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్ర స్థానంలో నిలిచిందని ఇందుకు కలెక్టర్, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. అవగాహన కల్పించిన కొంత మంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాలుస్తున్నారన్నారు. దీని వల్ల పక్కన ఉన్న పంటలు ,తోటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రాణ నష్టం కూడా సంభవించింద న్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్‌బాబా, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఎన్నెస్పీ భూముల సర్వే



(మొదటిపేజీ తరువాయి)

మేజర్‌పై గతంలో పేదలు గుడిసెలు వేసుకుని జీవించే వారు. కొందరు కోర్టును ఆశ్రయించి గుడిసెలను తొలగించాలని చేసిన ప్రయత్నాలు ఫలించడంతో అక్కడి నుంచి పేదలను ఖాళీ చేయించారు. దశాబ్ద కాలం క్రితం జరిగిన గుడిసెల తొలగింపు తర్వాత క్రమేపి సంపన్నులు, కొందరు రాజకీయ నాయకులు, అధికారులు ఎన్నెస్పీ స్థలాలను కబ్జా చేయడం ప్రారంభించారు. ఇద్దరు ఇంజనీరింగ్ అధికారుల్లో ఒకరు కాలువ స్థలాన్ని ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించగా మరొకరు ఏకంగా షెడ్డు వేశారు. ఓ రాజకీయ నాయకుడు స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించడం తదితర కబ్జాల నేపథ్యంలో ప్రజాపక్షం వరుస కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన ఖమ్మం కార్పోరేషన్, రెవెన్యూ, నీటి పారుదల శాఖాధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. 66 అడుగుల వెడల్పు గల ఈ కాలువ ఖమ్మంలో భూములకు అత్యంత విలువైన ప్రాంతంలో నుంచి వెలుతుంది. దీనిపై సర్వే నిర్వహించి మార్కింగ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని సర్వే అధికారులు తెలిపారు. సర్వే అధికారులను కలిసి సిపిఐ నాయకులు నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని కోరారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువుల కోటాను తగ్గించిన క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని ఆయన సూచించారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించకపోతే రైతులకు ఆర్థికంగా భారమవుతుందని ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారని హేమంతరావు తెలిపారు. ఈ ప్రభుత్వం రైతు భరోసా విషయంలో దాటవేత ధోరణిని అవలంబిస్తుందని యాసంగి సీజన్‌కు సంబంధించి రెండు ఎకరాలకు పైగా ఉన్న రైతులకు తక్షణం రైతు భరోసా డబ్బులు జమ చేయాలని వానా కాలానికి సంబంధించి రైతు భరోసా సైతం జమ చేయాలన్నారు. ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా మొక్కజొన్నలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ములకశిర కార్తె సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న మొక్కజొన్నలు, ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి తరలించాలని నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలోనూ ఈ ప్రభుత్వం చెప్పిన మాటను నిలబెట్టుకోలేకపోయిందన్నారు. వరుస విపత్తులు సంభవిస్తున్న నేపథ్యంలో పంటల బీమా పథకాన్ని ఈ సీజన్ నుంచే అమలు చేయాలని, నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల ఎనిమిదిన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు హేమంతరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉద్యమిస్తుందన్నారు. రైతు సంఘం సభ్యత్వ చేర్పింపు కార్యక్రమాన్ని ప్రారంభించి తొలి సభ్యత్వాన్ని హేమంతరావుకు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా నాయకులు పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, పుచ్చకాయల సుధాకర్, మామిడి సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, రాంకోటి, దొబ్బల కృష్ణ, రామకృష్ణ, వెంకటనర్సయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తోటపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా ప్రభుత్వ స్థలాల కబ్జా..!

(మొదటిపేజీ తరువాయి)

విస్మయానికి గురి చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమార్కులు చెలరేగిన సీనే ప్రస్తుతం రిపీట్ అవుతుండటం విశేషం. ఇందులో 3వ వార్డుకు చెందిన ఓ షాడో హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**స్థలానికి రూ.1లక్ష వసూళ్లు...**

ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలపై మళ్లీ కబ్జాల పర్వం మొదలవ్వడం ఆందోళన కరంగా మారింది. ప్రభుత్వం మారిన ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడకపోవడం స్థానికుల్లో ఆందళన కలిగిస్తోంది. ఈ దందాను అక్కడి కొందరు స్థానిక నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో స్థలానికి గాను రూ.1లక్ష చొప్పున తీసుకుని అప్పగిస్తున్నట్లు తెలిసింది. తాజాగా వరంగల్‌క్రాస్‌రోడ్డులోని ఆవేర్‌కాలనీవద్ద రోడ్డుపక్కన గుడిసెలు వేసుకున్న వారికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పంపిణీ జరుగుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక్కడ బేస్‌మెట్లను కూల్చి ఇతరులకు అక్రమ పద్ధతిలో కేటాయిస్తున్నట్లు పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

**మూడవ వార్డు షాడో హస్తం?...**

ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో మూడోవ వార్డుకు చెందిన ఓ షాడో నాయకుడి హస్తం కూడా ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ స్థలాల కేటాయింపులు, ఆక్రమణల వెనుక ఆయన ప్రభావం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇవి ఆరోపణలుగానే చక్కర్లు కొడుతున్నాయి తప్ప వాస్తవ ఆవస్తవాలేమిటన్నవి వెలుగులోకి రాలేదు. అయితే ప్రస్తుత షాడోగా చెప్పుకుంటున్న సదరు నాయకుడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఈ స్థలాల ఆక్రమణలో చక్రం తిప్పినట్లు విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**పరిశీలన చేస్తాను : ఆర్ఐ, జానీ**



ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలన చేసి ఆక్రమణలు జరిగితే సంబంధితవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సహకాలు అందజేత

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన టూ వీలర్ మెకానిక్‌ల పిల్లలకు ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రోత్సహకాల బహుమతులను అందజేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో 500లకు పైగా మార్కులు సాధించిన మెకానిక్ పిల్లలకు షేక్ ఆఫ్రిద్, గొలుసు హర్షవర్ధన్, అంబాటి జశ్వంత్, బోజెడ్ల చరణ్, లింగనబోయిన నిహారిక, యేసు, వర్షితలకు ఐదువేల రూపాయల చొప్పున ట్రాఫిక్ ఎస్ఐ రవి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవి మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. యూనియన్ల పట్ల వారి సేవలను కొనియాడారు. ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ గతంలో 26 మందికి ఐదువేల చొప్పున రూ.1.30 లక్షలు అందజేశామన్నారు. ఇప్పుడు ఆరుగురికి ఐదువేల చొప్పున రూ.30వేలు కలిపి మొత్తం




యూనియన్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన మెకానిక్ పిల్లలకు రూ.1.60 లక్షలు అందజేశామని తెలిపారు. యూనియన్ సభ్యత్వం కలిగిన మెకానిక్‌లు అందరికీ యూనియన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ప్రతి ఒక్క మెకానిక్ యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, హమీద్, శ్రీను, బుల్లెట్ అన్వర్, మురళీ, నాగేశ్వరరావు, లాలయ్య, అబ్బాస్, శేషు, పాండు, సుభాని, మెకానిక్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అడ్డు అదుపులేకుండా పెంచుతున్న ధరలపై ప్రజలు గళం విప్పాలని, అప్పుడే పాలకుల్లో చలనం వస్తుందన్నారు. పెరిగిన నిత్యవసరాలు, గ్యాస్, పెట్రో, డీజిల్ అధిక ధరలను నిరసిస్తూ జూన్ 10న చేపట్టబోయే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సామాన్య ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్న కేంద్రం తన వైఖరి మార్చుకుని ధల నియంత్రణ చేసేంత వరకు పోరాటం ఆగతని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని, ప్రజల పక్షాన నిలబడి పోరాడినప్పుడే పార్టీకి నిజమైన బలం చేకూరుతుందని గుర్తు చేశారు. మరోవైపు కొత్తగూడెం నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కృషితో అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, అనేక దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం కావడం హర్షణీయం అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, గోనె మణి, మునిగడప వెంకటేశ్వర్లు, ఎండి యూసుఫ్, బోయిన విజయ్, ముదెత్తుల శ్రీనివాస్, గోపికృష్ణ, ధర్మరాజు, సుధాకర్ పల్నాటి ప్రశాంత్, పి ధనలక్ష్మీ, వై శంకర్,. జహీర్, నగేష్, సత్యనారాయణచారి, సింగిరాల రమేష్, గద్దం ప్రభాకర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# ప్రతి రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరం



-ఆయిల్ పామ్, ఉద్యాన వన పంటలే రైతులకు భరోసా
-త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
-ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
-అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాలి
-అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యవసాయం నుంచి త్రాగునీటి వరకు ప్రతి రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖరీఫ్ 2026 వ్యవసాయ ప్రణాళిక ఖమ్మం నియోజక వర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, ఎంఎల్ఎలు రాందాస్ నాయక్, రాగమయి దయానంద్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అన్ని ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం నుంచి రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వర్షపాతం పరిస్థితులపై నిరంతరం రైతులకు సమాచారం అందించాలని క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా యూరియా లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా నానో యూరియా, ఇతర ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ నిజమైన రైతులకు మాత్రమే అందాలన్నారు. పంట కోత అనంతరం వరి కొయ్యలు, పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పునః సమీక్షించాలని స్థానిక ఎంఎల్ఏలతో సమన్వయం చేసుకుని ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలన్నారు. దేశంలో ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రం అగ్ర స్థానంలో ఉందని ఖమ్మం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఉద్యాన పంటల విస్తరణేనని ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో ఉన్న బ్రిచ్‌లు , మరమ్మతు పనులు, నిర్వహణ పనులు అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జూలూరుపాడు టన్నెల్ పనులను ప్రాధాన్యతతో చేపట్టడంతో పాటు అవసరమైన అటవీ అనుమతులు పొందాలన్నారు. సత్తుపల్లి పట్టణంలో నిర్మించిన వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్‌కు నీటి వనరు ఉందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. నీటి వనరు లేకపోతే ప్లాంట్ వినియోగంపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనులను వేగవంతం చేయాలన్నారు. ఖమ్మం నగరంలోని డివైడర్లపై అందమైన మొక్కలను నాటేందుకు అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.భూగర్భ డ్రైనేజీ పనులు నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లోఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఖమ్మం నగర పరిధిలోని ఇండ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఒక గుడిసె కూడా మిగలకుండా చూడాలని మొదటి దశలో మంజూరైన ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఆర్అండ్‌బి శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువు లోగా పూర్తి కావాలని చివరి దశలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఖమ్మం మార్కెట్ అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలన్నారు. కొత్తగా ప్రారంభమైన ఆసుపత్రులలో సేవలను మరింత విస్తరించాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సోలార్ పంపు సెట్ల ఏర్పాటుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వాడేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు కుడి, ఎడమ వైపుల రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తిగా గ్యాప్ లేకుండా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. అవసరమైన విత్తనాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్‌బాబా, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుంగిన రహదారి.. తప్పిన పెను ప్రమాదం..!





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వైరా రోడ్డు ప్రధాన రహదారి కుంగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఖమ్మం నగరంలోని కోర్టు సమీపంలోని సిఆర్‌జి టవర్స్ ప్రాంతంలో బుధవారం వైరా రోడ్డు ప్రధాన రహదారి ఒక్కసారిగా కుంగిపోయింది. ఆ సమయంలో పెద్ద వాహనాలు ఏమి రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న మున్సిపల్, ఆర్అండ్‌బి అధికారులు అటువైపుగా రాకపోకలను నిలిపివేసి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా గత 10 రోజులుగా ఆ ప్రాంతంలో పైపులైన్లు వేసేందుకు సోరంగాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఎటువంటి చర్యలు తీసుకోకుండానే పనులు చేపడుతుండడంతో గత రెండు రోజులుగా ఆ ప్రాంతంలో రహదారిలో ప్రకంపనాలు వస్తున్నాయని స్థానికులు వాపోయారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండానే పనులు చేపట్టడం వల్ల రహదారి ఒక్కసారిగా కుంగిపోయిందని పెను ప్రమాదం తప్పిందన్నారు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ నిర్మాణ పనులకు సంబంధించి తగు చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నగర వాసులు కోరుతున్నారు.

# చింతకాని మండలంలో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో 28 మందికి మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు బుధవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎన్ని అడ్డంకులు వచ్చినా అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇండ్లు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు.మంజూరు చేసిన చెక్కులను లబ్దిదారులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మొత్తం 28 లబ్దిదారులకు 28లక్షల చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపీ , ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు, నాయకులు కూరపాటి కిషోర్, మత్కేపల్లి, గాంధీనగర్, పాతర్లపాడు గ్రామల సర్పంచ్‌లు కంచం ద్రౌపది, ఓర్సు వీరభద్రం, ఓబినబోయిన లక్ష్మీ , మార్కెట్ కమిటీ డైరక్టర్ బందెల నాగార్జున , కంచం కోటేశ్వరరావు, తాళ్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో నేటి నుంచి గ్రామసభలు



**ప్రజాపక్షం/వైరాః** నేటి నుండి వైరా మున్సిపాలిటీలో గ్రామసభలు నిర్వహించనున్నారు. 99 రోజుల ప్రజాపాలన పట్టణ ప్రగతి కార్యక్రమ అమలుపై ఈ గ్రామసభలో చర్చించనున్నారు. వైరా మున్సిపాలిటీలో ఈ నెల4,6,8,10 తేదీల్లో జరిగే గ్రామసభల విధి విధానాలపై వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో మున్సిల్ కమీషనర్ ఎం.రామచంద్రరావు, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మేనేజర్ సుధీర్‌కుమార్‌తో కలిసి చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గ్రామపంచాయతీలో..**

వ్యవసాయం, విద్య, వేసవి కాలం ఏర్పాట్లు, వన మహోత్సవం, రుతుపవనాల రాక సందర్భంగా తగిన ఏర్పాట్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర కార్యక్రమాలతో కూడిన అంశాలపై గ్రామపంచాయతీల్లో 4వ తేది ఉదయం నుండి ఈ నెల10వ తేది వరకు అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో సక్రియ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదిన అష్ణగుర్తి, దాచాపురం, గన్నవరం, గొల్లపూడి, సిరిపురం(కెజి), స్టేజిపినపాక, 6వ తేది గరికపాడు, గొల్లెనపాడు, పాలడుగు, పుణ్యపురం, 8వ తేది గోవిందాపురం, కొండకొడిమ, లక్ష్మీ పురం, రెబ్బవరం, తాటిపూడి, వల్లాపురం, 10వ తేది ఖానాపురం, కొష్టాల, విప్పలమడక గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని, ఆయా గ్రామాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ సమస్యలపై చర్చించాలని ఎంపిడివో సక్రియ ప్రకటించారు.

# మున్సిపల్ కమీషనర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపల్ నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.రామచంద్రరావును బుధవారం వైరా మున్సిపల్ వైస్‌చైర్మన్ కట్ల సంతోష్, 14వ వార్డు కౌన్సిలర్ దీరావత్ వెంకటేశ్వర్లు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పాలకవర్గం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని అభివృద్ధిలో వైరా మున్సిపాలిటీని ముందు ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28, 29, 30, 31, 32 వార్డులలో 40 కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.4లక్షల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇటీవల వివిధ కారణాల చేత మృతి చెందిన వ్యక్తుల దహనసంస్కారాల నిమిత్తం రూ.10వేల చొప్పున మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి మంత్రి తరుపున వారు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, 29వ వార్డు కౌన్సిలర్ వెంపటి ఉమా, జిల్లా కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా అశోక్‌నాయక్, మున్సిపాలిటీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ కిషోర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, వెంపటి సురేష్, వెంపటి వెంకన్న, పొన్నెకంటి నర్సింహారావు, అట్టూరి వీరబాబు, పొన్నెకంటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఎం, వెంకటాయపాలెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అక్కడి సిపిఐ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పాసంగుల చందర్రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, రాష్ట్ర గిరిజన సమాఖ్య నాయకుడు అజ్మీరా రామ్మూర్తి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పగీళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యుడు రామ్మూర్తి, భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలను తొలగించండి



**-పేదల పక్షాన పోరాటం తప్పదు**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**-ఎన్నెస్పి భూముల సర్వేను పరిశీలించిన సిపిఐ బృందం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా ప్రభుత్వ భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించకపోతే పేదలచే ప్రభుత్వ భూములు అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హవేలీ సిపిఐ కార్యాలయంలో జరిగిన హవేలీ శాఖ సమావేశం నానబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సంపన్నుల పట్ల, కబ్జాదారుల పట్ల మేతక వైఖరిని అవలంభిస్తుందన్నారు. నిలువ నీడ లేక కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిందని ఈ ఖాళీ చేయడానికి ఎవరు కారకులో వారే ఇప్పుడు నాగార్జున సాగర్ కాలువ కట్టలను అక్రమిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ప్రభుత్వం తమకు అండగా నిలబడుతుందని ఆక్రమణదారులు, కబ్జాదారులు విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా యంత్రాంగం ఇదే రీతి అవలంభిస్తే పేదలను సమీకరించి ప్రభుత్వ భూములను అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**సర్వే పరిశీలన :**

ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సిపిఐ ఫిర్యాదు మేరకు జరుగుతున్న ఆక్రమణలను సిపిఐ బృందం పరిశీలించింది. నీటిపారుదల శాఖ, కార్పోరేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం 12వ డివిజన్‌లో ఎన్నెస్పి కాలువ ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ అధికారులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సురేష్ కోరారు.ఈ కార్యక్రమంలో హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

## వరల్డ్ లెటరసీ ఫౌండేషన్‌కు హసినిరెడ్డి ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వరల్డ్ లెటరసీ ఫౌండేషన్ యూత్ అంబాసిడర్ 2026 కార్యక్రమానికి ఖమ్మంకు చెందిన రావుల హసినిరెడ్డి ఎంపిక య్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి 1300 మంది దరఖాస్తులు చేసుకోగా ఇందులో హసినిరెడ్డి ఎంపిక కావడం అభినందనీయం. వరల్డ్ లెటరసీ ఫౌండేషన్ యూత్ అంబాసడర్ కార్యక్రమంలో భాగంగా 16 నుంచి 26 సంవత్సరాల వయస్సు కలిగిన యువతను అక్షరాస్యత కోసం పని చేసే నాయకులుగా సమాజ మార్పుకు కృషి చేసేవారిని ఎంపిక చేస్తారు. నాయకత్వ లక్షణాలు, ప్రజా ప్రాతినిథ్యం, కథా నైపుణ్యాలు, డిజిటల్ ప్రభావం వంటి అంశాలపై ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సమాజ మార్పుకు కోసం పనిచేసే సంస్థలు యూత్ అంబాసడర్ కార్యక్రమంకు అనుసంథానం చేస్తారు. జూన్ ఎనిమిదిన ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. జూన్ 15 నుంచి జూలై 26 మధ్య శిక్షణకు సంబంధించిన వ్యవహారాన్ని నిర్వహిస్తారు. ఆగస్టు 31 నుంచి సెలబ్రేషన్ వీక్ నిర్వహించి తుది నివేదికను సెప్టెంబర్ ఆరున నిర్వహిస్తారు. ఖమ్మంకు చెందిన హసినిరెడ్డి ఈ కార్యక్రమానికి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హసినిరెడ్డి తండ్రి ఆర్. కిషోర్‌రెడ్డి ఖమ్మంలో ప్రముఖ హోమియో వైద్యులుగా పని చేస్తున్నారు.

# మధిరకు ఐటి హబ్ మంజూరు

**-నెరవేరిన భట్టి ఇచ్చిన మరో హామీ**
**-హర్షం వెలిబుచ్చిన కాంగ్రెస్ నేతలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మధిర పట్టణానికి ఐటి హబ్ మంజూరైంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేయాలని టిజిఐసిసికి ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మధిరకు ఇచ్చిన హామీలలో ఐటి హబ్ మంజూరు ద్వారా మరో హామీని నెరవేర్చినట్లయింది. మధిర రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 43లో 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ ఐటి హబ్‌ను నిర్మించనున్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఐటి హబ్ నిర్మాణానికి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఐటి హబ్ నిర్మాణంతో యువతకు అవకాశాలు లభిస్తాయని సొంత ప్రాంతంలోనే సాఫ్ట్‌వేర్ సహా అనుబంధ రంగాల్లో పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు. మల్లు భట్టివిక్రమార్క మధిర క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ఇందుకు సంబంధించిన మంజూరు ప్రతులను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామినేని సుజాత, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ధనికుమార్, మధిర అభివృద్ధి కమిటీ సభ్యులు వాసిరెడ్డి రామనాథం, మిరియాల వెంకటరమణ, కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షులు పారుపల్లి విజయ్, కర్నాటి రామారావు, నవీన్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ ఫలితాలలో

# ప్రియదర్శిని, చైతన్య విద్యార్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జేఎన్‌టీయూ హైదరాబాద్ మంగళవారం విడుదల చేసిన మూడవ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ విద్యార్థులు, ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిలు విజయకేతనం ఎగరవేశారు. శ్రీ చైతన్య విద్యార్థులలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్,ఇంజనీరింగ్‌లో కంచర్ల ఉషశ్రీ 40, షేక్ ఆఫ్రీన్ 9.22, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో మరోజు త్రిష 9.10, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో మోతకూరి నాగ ప్రవీణ్ 9.10, తేజ సాయి 9.0, ఎలక్ట్రికల్‌లో కంచర్ల లక్ష్మి , లకావత్ బాబు8.95, మెకానికల్ ఇంజనీరింగ్‌లో గుగులోత్ వరుణ్ 8.55, పలు విభాగాలలో 86మంది విద్యార్థులు 9.0 ఎస్‌జీపీఏలు సాధించారు. అలాగే ప్రియదర్శినిలో ఈసీఈలో ఎం భార్గవి 9.55, రైప 8.95, ఏ. కావ్య 8.65, అనన్య8.50, సీఎస్ఎంలో టి.సింధుజ 9.10, టి. వినీల 8.95, వై. చైతన్య దీప్తి 8.88, ఏఐడీలో ఎండి సానియామోహరాజ్, ఇంద్రనీలవేణి 8.65 జీపీఏలను సాధించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల చైర్మన్లు మల్లెంపాటి శ్రీధర్, కాటేపల్లి నవీన్‌బాబు విద్యార్థులను అభినందించారు.

## వ్యవసాయ మోటార్ల వైర్లు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి ఒకటో నెంబర్ తూము సమీపంలోని వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కరెంటు వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు 20 మోటార్లకు కట్ చేసుకొని ఎత్తుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి అగ్రహారం సమీపంలోని వైరా రిజర్వాయర్ కాల్వ ఒకటో నెంబర్ సమీపంలోని రైతులు వ్యవసాయ అవసరాలు నిమిత్తం బోర్లు వేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో పంటలు పూర్తిగా చేతికి రావడంతో రైతులు ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఒకేసారి 20 వ్యవసాయ మోటార్ల వైర్లను కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో మోటార్లు కూడా ఎత్తుకొని వెళతారా అనే ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు.

## కొనసాగుతున్న మూడవ విడత దోస్త్

**ప్రజాపక్షం/ఖమ్మం :** డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ మూడవ దశ కొనసాగుతుందని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వెబ్ ఆప్షన్‌లకు ఈనెల 16 వరకు సమయం ఉందని మొదటి రెండు విడతల్లో దరఖాస్తు చేసుకోని వారు మూడవ విడత చేసుకోవచ్చునన్నారు. మొదటి రెండు విడతల్లో అడ్మిషన్లు పొందిన వారు ఈనెల ఐదు లోపు సెల్ రిపోర్టింగ్ చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## పాఠశాలకు సామగ్రి వితరణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** సన్‌రైజ్ అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లారం పాఠశాలకు బోధనా సామాగ్రిని బుధవారం అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షులు ఏనుగు శివ రాఘవ మాతృమూర్తి భవాని పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, ఇతర సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు ఎంపివో సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అత్యున్నత బోధన ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. మల్లారం పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హరిబాబు, సంస్థ ప్రతినిధులు కిరణ్‌బాబు, సుమన్‌బాబు, శోభన్ బాబు, పంచాయతీ కార్యదర్శి సిద్ధిఖ్‌మియా, మాలతిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిర్రా కృష్ణయ్యకు పరామర్శ



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ఇటీవల వడదెబ్బకు గురై వారంరోజులు పాటు ఖమ్మం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయి తెట్టెలపాడు తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు చిర్రా కృష్ణయ్యను బుధవారం బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బిల్లగిరి ధనుంజయ్ గీత, కార్మికమోకు దెబ్బ మండల కమిటీ అధ్యక్షులు రెడ్డిమల్ల నరేందర్, గ్రామ సర్పంచ్ చిర్రా నర్సమ్మ, తోర్రికొండ వెంకటనారాయణ, గుంటి పుల్లయ్య, బిల్లగిరి వెంకటేశ్వర్లు , వంగూరు మధుబాబు, పగిడిపల్లి బాబు, ఈర్ల ఈశ్వర్‌లు పరామర్శించి మనోధైర్యంగా ఉండాలని కోరారు.

# వారసులకు వెంటనే నియామకపు పత్రాలు ఇవ్వాలి



**- సింగరేణి జిఎం కార్యాలయం ముందు భారీ దర్నా**
**- కార్యాలయం ముట్టడి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థలో ఎంతో కాలంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న మెటికల్ ఫిట్ వారసులకు వెంటనే ఉద్యోగ నియామకపు పత్రాలు జారీ చేయాలని గుర్తింపు సంఘం సింగరేణ కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏరియా మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడి చేసి వారసులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జున రావు మాట్లాడుతూ, ఉద్యోగం చేస్తున్న రోజుల్లో అనారోగ్యాల పాలై, ప్రమాదాలకు గురై, ఇతర కారణాలతో సేవకులు తమ సేవలను కోల్పోయిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఉపాది భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో డిపెండెంట్ ఉద్యోగ విధానం అమల్లోనికి వచ్చిందన్నారు. కాగా మెడికల్ పరీక్షల్లో అర్హత సాధించి అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకున్నప్పటికీ వందలాది మంది వారసులు ఏళ్లు తరపడి ఉద్యోగాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోస ం ఎదురు చూస్తున్న కుటుంబాల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్యం వంటి ఖర్చులు వెచ్చించలేక, తీవ్ర ఆర్థికిబ్బదులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మిక కుటుంబాల సమస్యలను మానవతాకోణంలో పరిశీలించి వెంటనే ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సింగరేణి సంస్థ లాభాల సాధనలో కార్మికుల పాత్ర కీలకమని, అలాంటి కార్మికుల కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. మెడికల్ ఫిట్ అయిన ప్రతీ వారసునికి న్యాయం చేయాలన్నారు. లేకంటే రాబోయే రోజుల్లో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం నాయకులు సింగరేణి జనరల్ మేనేజర్ షాలేమ్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. విషయాన్ని సానుకూలంగా పరిశీలించిన జిఎం వెంటనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బేరర్స్ సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, ఫిట్ కార్యదర్శులు భూక్యా రమేష్, కమల్, సౌజన్య, సీనియర్ నాయకులు మండల రాజేశ్వరరావు, సురేందర్, మాచర్ల శ్రీనివాస్, కొవ్వూరి రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, అప్పారావు, శశిధర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలను జయప్రదం చేయండి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ, వార్డు సభలను జయప్రథం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. జూన్ 1 నుండి 10వ తేది వరకు నిర్వహించనున్న ఈ సభల ఏర్పాట్లపై కలెక్టర్ బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు, తహాశిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామాలు, వార్డుల స్థాయిలో సమస్యలను గిర్తించి పరిష్కారం చేయడమే లక్ష్యంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాలను నాలుగు సెక్టార్లుగా, మున్సిపాలిటీల పరిధిలోని వార్డులను కూడా క్లస్టర్లుగా విభజించి ప్రణాళికా బద్ధంగా సభలను నిర్వహించాలని సూచించారు. మౌళిక సదుపాయాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, ఎస్ఐర్ (ప్రత్యేక ఓటర్ నమాదు) విద్యుత్, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి,పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి సేవలు, ప్రభుత్వకార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువత స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ముందస్తుగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# వాహనాల లైట్ల అరాచకం..లెక్క తేల్చేదెవదో..!



**-వాహనాలకు లెక్కకు మించి అమర్చిన లైట్లు**
**-అంచనాలకు అందని ప్రమాదాలు**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్దంగా అధిక వెలుతురు ఇచ్చే లైట్లతో వాహనాలు సంచరిస్తుండటం వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో టిప్పర్లు, లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అమర్చిన అధిక శక్తి ఎల్ఈడీ లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారుల కళ్లను మిరుమిట్లు గొలిపి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని, వాహనాల్లో నిబంధనలకు మంచి అదనపు లైట్లు అమర్చి రహదారులపై యథేచ్చగా తిరుగుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలకు నాలుగు, ఆటోలకు ఆరు, లారీలు, బస్సులకు ఎనిమిది లేదా అంతకంటే ఎక్కువ లైట్లు అమర్చి ప్రయాణాలు సాగిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

**ప్రమాదాలకు కారణమవుతున్న అధిక వెలుతురు...**

ఎదురుగా వచ్చే వాహనాలపై అధిక వెలుతురు పడటంతో డ్రైవర్లు కొంతసేపు రహదారి స్పష్టంగా కనిపించక ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అంటున్నారు.

**ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి**

రోడ్డు భద్రతకు ముప్పు మారుతున్న ఈ సమస్యపై రవాణా శాఖ, పోలీసు శాఖలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నింబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా అమర్చిన లైట్లను తొలగించి, జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు. వాహనాల లైట్ల అరాచకం..లెక్క తెల్చాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కొనేందుకు సమన్వయంతో పనిచేయాలి : ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రానున్న వర్షాకాలంలో ఎదురయే ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, డిడిఆర్‌ఎఫ్, సింగరేణి రెస్క్యూ టీమ్స్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేయాని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం తన ఛాంబర్లో ప్రకృతి వైపరిత్యాలపై కో ఆర్డినేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా రక్షణ బృందాలను సమీ ప్రాంతాల్లో సిద్ధం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్, ఎన్‌డిఆర్‌ఎఫ్, డిడి ఆర్‌ఎఫ్ సింగరేణి రెస్క్యూ టీమ్‌లు, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేసిన నాడు సత్ఫలితాలు వస్తాయన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, రోప్స్, చెట్లను తొలగించేందుకు కావాల్సిన కట్టర్లతో పాటు ఇర రక్షణ సామాగ్రిని అందుబాటులు ఉంచుకోవాలన్నారు. ప్రకృతి వైపరిత్యాల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తుగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. అదే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్, టీజీఎస్పి అస్సిటెంట్ కమాండెంట్ మరియదాస్, ఆపరేషన్ ఆర్‌అండ్‌బి రవి, సింగరేణి రెస్క్యూ టీమ్ ఇంచార్జ్ అనంతరాములు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్ సుమంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత

**- నలుగురు వ్యక్తుల అరెస్ట్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** వాహన తనిఖీల్లో భాగంగా ఎక్సైజ్ అధికారులు 90.5 కిలోల ఎండు గజాయిని పట్టుకుని, నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వివరాల ప్రకారం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సిహెచ్ శ్రీహరిరావు సిబ్బందితో కలిసి బుధవారం కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే రోడ్డులోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా అనుమానాస్పదంగా వస్తున్న రెండు వాహనాలు ఆపి తనిఖీలు చేయగా మొదటి వాహనంలో 4 కేజీల 300 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీనిని ఖమ్మంలోని మామిళ్లగూడెంకు చెందిన బానోత్ వీరేందర్, రమణగుట్టకు చెందిన గుత్తికొండ యశ్వంత్‌లు సీలేరు నుండి ఖమ్మం జిల్లాకు తరలిస్తుదంగా పట్టుబడ్డారు. మరో వాహన తనిఖీలో 5 కేజీల 200 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఖమ్మంలోని లెనిన్ గర్‌కు చెందిన షేక్ ఖాసీం, పాండురంగాపురంకు చెందిన షేక్ అమీర్ సీలేరు నుండి ఖమ్మం జిల్లాకు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఈ రెండు వాహనాలను సీజ్ చేయడంతో పాటు నలుగు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుండి సెల్‌ఫోన్లు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్, అహ్మద్, జమాల్ షరీఫ్, కానిస్టేబుళ్లు శివకుమార్, నాగరాజు, ప్రసన్నకుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గురుదేవ్ విద్యార్థిని మాధురికి నగదు పురస్కారం



**ప్రజాపక్షం/చర్ల :** టిజిఆర్‌జేసి సెట్‌లో ఉత్తమ ఫలితం సాధించిన బి మాధురికి నగదు పురస్కారం దక్కింది. ఈ నగదు పురస్కారాన్ని చర్లకు చెందిన పరుచూరి మనోహార్ ప్రసాద్ , లక్ష్మీ దంపతులు రూ.10 వేలు అందజేశారు. జన్మభూమిపై ఉన్న మక్కువతో ఆ దంపతులు 18వ ర్యాంకు సాధించినందుకు గానూ ఈ నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. విజయవాడలో స్థిరపడ్డ ఆ దంపతులు నిర్వహించే ప్రకృతి వాకర్స్ టీమ్ ప్రతీ ఏటా చేపట్టే విద్యా ప్రోత్సహక కార్యక్రమాల్లో భాగంగా గురుదేవ్ విద్యార్థిని అభినందిస్తూ ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ విద్యార్థి పదో తరగతి ఫలితాల్లో 562 మార్కులు సాధించడమే కాకుండా ఆర్‌జేసి సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంకు సాధించింది. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేములపల్లి ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు గిరి ప్రసాద్, ఎంఇఓ పరిటాల వెంకటరమణ, సుబ్రహ్మణ్యం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**- సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ**

**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి వరదల పట్ల అంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో వరదలను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ అన్నారు. బుధవారం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో డిఎస్పి అరుణ్ కుమార్‌తో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలు, సదుపాయాల కల్పనపై ఆయన శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రేష్ఠ మాట్లాడుతూ వరదల దృష్ట్యా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అన్నిశాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు, సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్ల ప్రణాళికలు సిద్ధం చేయాలని, వరదల సమయంలో ఎలాంటి ఆస్థి, ప్రాణనష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి పరివాహన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని, వరదల సమయంలో ఉద్యోగులు ఎవ్వరూ అనుమతి లేకునండా ముందస్తు సెలువులు పెట్టరాదని సూచించారు. రోడ్లపై వరదలు పొంగి పొర్లే ప్రాంతాలను గుర్తించి ప్రజలు అటువైపు వెళ్లకుండా పంచాయితీ కార్యదర్శులు, పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో బోట్లు సిద్ధం ఉంచుకోవాలని, పునరావాస కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అంటు వ్యాధులు ప్రభలకుండా వైద్యశాఖ తగిన జాగ్రత్తలు తీసుకుని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, వరదలపై సంబంధిత గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేయాలని, అత్యవసరిస్థిలుల్లో డ్రోన్లు ఉపయోగించేందుకు శిక్షణ ఇవ్వాలని, త్వరలో జరిగే మరో సమావేశానికి అధికారులంతా సమగ్ర నివేదకలు సిద్ధం చేసుకోవాలన్నారు.

## రూ. 15లక్షలతో ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**-ప్రార్థనా స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎంఎల్‌ఏ పాయం**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని ఈద్గా ప్రాంగణంలో రూ 15లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ అన్ని మతాల ప్రార్థనా స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముస్లిం సోదరుల విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణంతో ఈద్గా ప్రాంగణానికి రక్షణతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ మధుకర్, ఏఈ ఐవీఎన్ ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ పిచ్చేశ్వరరావు, జీపీఓ లక్ష్మణ్, పంచాయితీ కార్యదర్శి యాకుబ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్ష్మయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచులు బానోతు సదర్‌లాల్, యేనిక ఉషారాణి, సప్కా పిచ్చయ్య, కొర్స కృష్ణ, కుంజా జాను, ఎట్టి నరేష్, ఉపసర్పంచులు తుళ్లూరి ప్రకాష్‌రావు, మేకల అంజిబాబు, జామా మసీదు నాయకులు ఎస్‌కే శబ్బార్, ఆలీ, ఖురేషి, సాదిక్ పాషా, సి హుస్సేన్, ఎస్‌కే గాలిబ్, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లతో ఉచిత విద్యుత్‌కు ముప్పు



**-మొక్కజొన్న రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి: బొంతు**

**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్యుత్ పంపిణీ సంస్థలను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. ఎర్రబోడులో రైతు సంఘం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విద్యుత్ రంగ ప్రైవేటీకరణలో భాగమని, భవిష్యత్తులో ఉచిత విద్యుత్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కోసం ప్రత్యేక విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు పేరుతో కొత్త విధానాలు అమలు చేయడం వెనుక ఇతర ఉద్దేశాలు ఉన్నాయని విమర్శించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పటికే ప్రభుత్వానికి విక్రయించిన పంటకు సంబంధించిన బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతు భరోసా నిధులను కూడా విడుదల చేయాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాల్లో రైతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు తుమ్మోజు రామమూర్తి, పాపినేని నాగేశ్వరరావు, భాగం వెంకటప్పారావు, ఎస్‌కే సైదులు, తమ్మినేని ముత్తయ్య, వల్లభినేని మురళి, పాసిన్ని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# గాలి దుమారం వస్తే గాఢాంధకారమే..

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గాలి దుమారం వస్తే గాఢాంధకారంలో 15 గ్రామాలు 8,000 మంది వినియోగదారులు ఇబ్బందులు పడాల్సిందే. గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద కోరుకొండి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో వానాకాలం లో గాలి దుమారం వస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ విద్యుత్ కేంద్రం కు తల్లాడ నుంచి మిట్టపల్లి కుర్నవల్లి మీదుగా పెద్ద కోరు కొండి విద్యుత్ ఉపకేంద్రంకు సరఫరా అవుతుంది. సరఫరా లో గాలి దుమారం వస్తే ఇన్సులేటర్లు పేలి లేదా విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగి ఉంటే ఆరోజు తప్పనిసరిగా గాఢాంధకారంలో మగ్గాల్సిందే. ఈ సమయంలో వేసవిలో ఉక్కపోతతో ఇబ్బంది చిన్న పిల్లలు ఉన్నవారు ఏడుపులతో ఇబ్బంది. వానాకాలంలో దోమలు ఈగలు స్వైర విహారం తో ఇక్కట్లు ఆపై వ్యవసాయ రైస్ మిల్లులు వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చారం తదితర గ్రామాలలో ఉన్న రైస్ మిల్లులకు ఇబ్బందే గాలి దుమారం వస్తే ఒకరోజు పాటు చీకట్లో ఇబ్బందులు పడాల్సిందే పైగా మరమ్మత్తులు చేయాల్సివస్తే కొందరు స్థానికంగా ఉద్యోగులు లేకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మరమ్మత్తులు చేస్తేనే విద్యుత్తు లేనిచో వెతలు పడాల్సిందే మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇదేవిధంగా కొనసాగుతూ ఉండటం వలన ఈ సంవత్సరం నూతనంగా లింగాల విద్యుత్తు కేంద్రము నిర్మాణాలు పూర్తికా వచ్చింది. లింగాల నుంచి నేరుగా టేకులపల్లి విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా అవడం ద్వారా అదే లైను పెద్ద కోరుకొండికి లైను నిర్మాణాలు కొనసాగుతూ ఉన్నవి. ఇవి త్వరగా పూర్తయితేనే వినియోగదారులు ఇబ్బందులు తొలిగితాయి త్వరగా నిర్మాణాలను చేపట్టి ఇబ్బందులను తీర్చాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ పెద్ద కోరుకొండి అధికారిని వివరణ కోరగా మరో 20 రోజుల్లో లింగాల నుంచి పెద్ద కోరు కొండి కి ,లింగాల, నుంచి టేకులపల్లికి ,లైను పూర్తయ్యే అవకాశం ఉందని అప్పుడు వినియోగదారులు ఇబ్బందులు తొలగుతాయని తెలుపుతున్నారు.

## హామీలు అమలు చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు..

**-ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి: నున్నా**



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని సీపీఐ(ఎం)ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎర్రబోడులో వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సమావేశం తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు కూలీలకు హామీ ఇచ్చిన రూ 2,500 ఆర్థిక సహాయం, పూర్తి స్థాయి రుణమాఫీ, రైతు భరోసా అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, పూర్తి స్థాయి పారదర్శకతతో జరగాలని డిమాండ్ చేశారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జాబితాల్లోని అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరుచేసే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. జిల్లాలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వడమే కాకుండా వెంటనే నిధులు విడుదల చేయాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ నీటిని సింగరేణి మండల ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, సుంకర సుధాకర్, దొంతబోయిన నాగేశ్వరరావు, కుటుంబరావు పాల్గొన్నారు.

## రాజుపేటలో వైభవంగా శ్రీరామ మందిర వార్షికోత్సవం

**-భారీగా తరలివచ్చిన భక్తులు, ఘనంగా అన్నదాన కార్యక్రమం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలోని శ్రీరామ మందిర వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, విశేష అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించగా, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

**అన్నదానంతో భక్తులకు ఆతిథ్యం..**

ఉత్సవానికి వచ్చేసిన భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు, గ్రామ యువకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**గ్రామ ప్రజల సహకారంతో విజయవంతం....**

గ్రామ ప్రజలందరి సహకారంతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించగలిగామని రాజుపేట సర్పంచ్ బానోత్ మహేష్, ఉప సర్పంచ్ సోలిపురం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు, ఏర్పాట్లలో కృషి చేసిన కమిటీ సభ్యులు, యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కందాల సురేందర్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ కందాల కమలాకర్ రెడ్డి, తూముల శ్రీను, దేవరాశెట్టి నాగేశ్వరరావు, దాచేపల్లి సైదులు, బైరిశెట్టి వెంకన్నతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో బాధిత కుటుంబానికి తక్షణసాయం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కోట యేసు గృహంలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఆస్తి నష్టం జరిగింది. సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి ద్వారా విషయంతెలుసుకున్న తహశీల్దార్ కె.సునీత ఎలిజబెత్ వెంటనే స్పందించి బుధవారం రెవెన్యూ అధికారులను సంఘటనా స్థలానికి పంపించి పంచనామా నివేదికను ఉన్నతాధికారులకు పంపించి తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి 25కేజిల బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, జిపివో శ్రీనివాసరావు, మాజీ సొసైటీ చైర్మన్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ గౌరాజు, మల్లీశ్వరి, కర్నాటి సుధాకర్‌రెడ్డి, వేముల వెంకటేశ్వరరావు, సభ్యులు శీలం వెంకట్రావమ్మ, మానుకొండ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** హెచ్‌పివీ వ్యాక్సిన్ను బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్‌కు వేల రూపాయలు ఖర్చవుతుండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు నడుస్తున్నటువంటి బాలికలుకు ఈ హెచ్పివి వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని. జూలూరుపాడు మండలంలో సుమారుగా 155 మంది బాలికలు 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు నడుస్తున్నటువంటి బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఈరోజు నుండి ఆదివారం తప్ప మిగతా రోజులన్నీ ఈ వ్యాక్సిన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇవ్వడం జరుగుతుందని, క్యాన్సర్ల నివారణ పురుషులు మరియు మహిళల్లో మల ద్వారా అనాల్ క్యాన్సర్ నివారణ జననేంద్రియ మొటిమలు జనైటెల్ వర్ట్స్ నివారణ రాకుండా నివారించడానికి ఉపయోగపడుతుందని, కావున అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ ఆయుష్ మెడికల్ ఆఫీసర్, హెల్త్ సూపర్వైజర్ రత్నకుమార్, హెచ్వి రాధిక, ప్రియదర్శిని, ఫార్మసి ఆఫీసర్ శశికళ, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశాలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి జ్ఞాపిక



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని మణుగూరు మండలంలోని పైలెట్ కాలనీ, భగత్ సింగ్ నగర్‌లో ఎండీ వలివుద్దీన్ మర్యాద పూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించి జ్ఞాపికను సమర్పించారు. ఈ సందర్భంగా ఎండీ వలివుద్దీన్ మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం వంటి అనేక రంగాలలో ఎమ్మెల్యే చేస్తున్న కృషి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రతి వర్గానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే సేవలు ఆదర్శనీయమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే చూపుతున్న చొరవను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, రాష్ట్ర నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.గణేష్ రెడ్డి, జీవి, కోర్లకుంట అప్పారావు, యాకుబ్, త్రిమూర్తులు, చింతల కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని ఎమ్మెల్యే ని అభినందించారు.

## ఐఐటీ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ సాధించిన విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** ఆల్ ఇండియా ఐఐటీ ప్రవేశ పరీక్షలో 856 వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్న మణుగూరు మండలంలోని పైలెట్ కాలనీకి చెందిన బానోత్ సుమంత్‌ను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఖమ్మంలోని శ్రీ చైతన్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న బానోత్ సుమంత్ జాతీయ స్థాయిలో 856వ ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఎక్సలెంట్ పైలెట్ కాలనీ స్కూల్ పూర్వ విద్యార్థిగా సుమంత్ సాధించిన ఈ విజయం మణుగూరు ప్రాంతానికి, పినపాక నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు బానోత్ రవి, బానోత్ అరుణ లను ఎమ్మెల్యే పాయం అభినందిస్తూ, తమ కుమారుడి ఉన్నత విద్య కోసం వారు అందించిన ప్రోత్సాహం మరియు సహకారం ప్రశంసనీయమని అన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించిన సుమంత్ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం సుమంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం శ్రీ చైతన్య కళాశాల బోటనీ లెక్చరర్ రావులపల్లి నరసింహారావు, కుటుంబ సభ్యులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, స్థానిక నాయకులు, అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పూర్తిగా గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ..!

-వెంగన్నపాలెం గ్రామంలో పారిశుధ్య సమస్యలు
-దేవాలయం పక్కనే మురుగు నీరు నిల్వలు
-తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలోని వెంగన్నపాలెం గ్రామంలో పారిశుధ్య సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. గ్రామంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనాల్సిన పవిత్ర ప్రదేశం పక్కనే మురుగు నీరు నిల్వ ఉండటం బాధాకరమని వారు పేర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు చంద్రుగొండ వెళ్లే రహదారి పక్కన ఉన్న ముత్యాలమ్మ తల్లి దేవాలయం ఎదుట కూడా మురుగు నీరు బీటీ రోడ్డుపైనే ప్రవహిస్తోంది. రహదారి పక్కన నిల్వైన మురుగు నీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రహదారిపైనే మురుగు నీరు ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించకపోవడం శోచనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం, మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల గ్రామ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలాంటి సమస్యలు నెలకొన్నప్పటికీ నిత్యం ఈ ప్రాంతంలో తిరిగే అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మురుగు నీటి నిల్వలను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పోలవరం ముంపు ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలి

-సీడబ్ల్యూసీ అధికారులకు బీఆర్ఎస్ నాయకుల వినతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో పెరుగుతున్న ముంపు ముప్పుపై తెలంగాణ ప్రజల ఆందోళనలను బీఆర్ఎస్ పార్టీ కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ)దృష్టికి తీసుకెళ్లింది. పోలవరం ప్రభావిత ప్రాంతాల రక్షణ కోసం సమగ్ర చర్యలు చేపట్టాలని కోరుతూ అశ్వాపురం, బూర్గంపాడు మండలాల బీఆర్ఎస్ నాయకులు బుధవారం సారపాకలో సీడబ్ల్యూసీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పోలవరం ప్రాజెక్ట్ వల్ల తెలంగాణలోని ముంపు గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమగ్ర బ్యాక్ వాటర్ అధ్యయనం చేపట్టడం, తెలంగాణ ముంపు గ్రామాలకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ ప్రకటించడం, పోలవ రం ఆపరేషన్ రూల్ కర్వ్‌ను సవరించడం, ప్రాజెక్టు డిజైన్, స్పిల్ వే సామర్థ్యాన్ని పునఃసమీక్షించడం వంటి కీలక డిమాండ్లను వినిపించారు. అలాగే కిన్నెరసాని, ముర్రేడు తదితర వాగులపై ప్రత్యేక అధ్యయనం నిర్వహించాలని, భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పినపాక నియోజకవర్గంలో కొత్త ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని కోరారు. మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్‌కు ప్రత్యేక భద్రత కల్పించడంతో పాటు గోదావరి నదిలో భారీ స్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రభావిత ప్రాంతాల్లో కరకట్టలు, పంపింగ్ స్టేషన్లు, రక్షణ గోడలు, పునరావాస కాలనీలు, ఇతర రక్షణ చర్యలను పోలవరం ప్రాజెక్ట్ వ్యయంలో భాగంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాలను అమలు చేయరాదని స్పష్టం చేశారు. డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నాయకులు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు, అశ్వాపురం మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, కోడి అమరేందర్, నాయకులు మర్రి మల్లారెడ్డి, వెన్న అశోక్, కంచుగంట్ల వీరభద్రం, గొర్రెముచ్చ వెంకటరమణ, డాక్టర్ బాబు, కర్రీ నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, బొబ్బిలి దాసు, గోపి కృష్ణ, రామకృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని విద్యా సంస్థల బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్

మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం



**ప్రజాపక్షం/మణుగూరు:** పిల్లలు తల్లిదండ్రుల ఆశలు, దేశ భవిష్యత్తు అని, వారి భద్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయకులతో పాటు రవాణా శాఖపై కూడా ఉందని భద్రాచలం యూనిట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య పేర్కొన్నారు. విద్యా సంస్థలకు చెందిన ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బుధవారం రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో మణుగూరు స్నేహ గార్డెన్స్‌లో మణుగూరు డివిజన్ పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు అరవింద్ కుమార్ అధ్యక్షతన, యాజమాన్యం ప్రతినిధులు,స్కూల్ బస్సు డ్రైవర్లు మరియు సహాయకులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రైవర్ మైండ్‌సెట్ సరిగ్గా ఉంటే అనేక ప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కేవలం వాహనం లేదా రోడ్డు పరిస్థితులు మాత్రమే కారణం కాదని, చాలావరకు డ్రైవర్ మైండ్‌సెట్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. డ్రైవర్ తన మానసిక స్థితిని సమతుల్యంగా ఉంచుకొని, రోడ్డు పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, వాహనం కండిషన్, ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత అలవాట్లు మరియు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సరైన నిర్ణయాలు తీసుకుంటే అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, నిద్రమత్తులో వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, కోపం, ఆందోళన లేదా ఇతర ఆలోచనలతో వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం వంటి అంశాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. డ్రైవర్ అప్రమత్తత, ఓర్పు, క్రమశిక్షణ మరియు బాధ్యతాయుతమైన నిర్ణయాల ద్వారా తన ప్రాణాలతో పాటు తోటి ప్రయాణికుల విలువైన ప్రాణాలను కూడా కాపాడగలడని పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ప్రతి ఉదయం బస్సులో ఎక్కే విద్యార్థి సాయంత్రం క్షేమంగా తన ఇంటికి చేరుకోవడమే అందరి లక్ష్యంగా ఉండాలని, పిల్లల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎమ్ అరవింద్ కుమార్,జి. మధు సూదన్ రెడ్డి, ఎండి. ఈసబ్ షరీఫ్, ప్రతాప్ రెడ్డి,ఐజాక్ థామోస్, శ్రీనివాస్, చంద్ర మౌళి, సంపత్ రెడ్డి, జానిమియా ఖాన్, రామన్ రెడ్డి, నరేందర్ డ్రైవర్లు, సహాయకులు, రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకూ వెలుగు..!

-ఊరూరికీ ఆర్టీసీ సేవలు
-గతంలో బస్సులు రాని గ్రామాలెన్నో
-బస్ రాకతో గ్రామీణ ప్రజల ఆనందం



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 4న స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఏడూళ్లబయ్యారం గ్రామంలో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు ఏడూళ్లబయ్యారం, పాతరెడ్డిపాలెం, వెంకట్రావుపేట, చింతలబయ్యారం, జగ్గారం, బెస్తపేట గ్రామాల మీదుగా ప్రయాణిస్తూ ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తోంది. గతంలో బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చేది. అత్యవసర పరిస్థితుల్లో పట్టణాలకు చేరుకోవడం కూడా కష్టసాధ్యంగా ఉండేది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు సులభంగా మండల, జిల్లా కేంద్రాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణిస్తూ ప్రయోజనం పొందుతున్నారు. బస్సు సేవలు ప్రారంభానికి ముందు గ్రామ పంచాయితీల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు రహదారుల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ తీగలను సరి చేయడం వంటి చర్యలు చేపట్టి బస్సు రాకకు మార్గం సుగుమం చేశారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతోపాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు మరింత చేరువయ్యారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### గతంలో గంటల తరబడి ఎదురుచూసే వాళ్లం...
### పాతరెడ్డిపాలెం సర్పంచ్ సాగబోయిన నాగకుమారి



గతంలో బస్సులు సౌకర్యం ఇంతగా లేదు, గంటల తరబడి బస్సు కోసం ఎదురుచూసే వాళ్లం, ప్రస్తుతం బస్సు ఉదయం, సాయంత్రం వేళలో సమయానికి వస్తున్నాయి. మహిళలు ఉచితంగా, సురక్షితంగా ప్రయాణించేందుకు అవకాశం రావడంతో సంతోషిస్తున్నామన్నారు. సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోగలుగుతున్నాం.

## పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై సీడబ్ల్యూసీ క్షేత్రస్థాయి పరిశీలన

-భద్రాచలం, బూర్గంపాడు పరిసరాల్లో పంట భూములపై ముంపు ముప్పు
-43 అడుగుల కాంటూర్ వరకు ప్రభావం ఉండొచ్చని ప్రాథమిక అంచనా, రైతుల్లో ఆందోళన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం, బూర్గంపాడు మండలాల పరిసర ప్రాంతాల్లోని వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశముందని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ)అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో సీడబ్ల్యూసీ అధికారుల బృందం బుధవారం బూర్గంపాడు మండలంలోని సారపాక పెదవాగు పరివాహక ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.

### సారపాక పెదవాగు వద్ద ముంపు ప్రభావిత ప్రాంతాల గుర్తింపు

గోదావరి నదిలో వరద ప్రవాహాలకు పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం తోడైతే ఏయే ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సారపాక పెదవాగు పరివాహక ప్రాంతంతో పాటు పరిసర వ్యవసాయ భూములను పరిశీలించి, ముంపు ప్రభావం ఉండే ప్రాంతాలను గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 43 అడుగుల కాంటూర్ స్థాయి వరకు బ్యాక్ వాటర్ ప్రభావం విస్తరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. దీంతో భద్రాచలం, బూర్గంపాడు మండలాల పరిధిలోని పంట పొలాలు, వ్యవసాయ భూముల భవిష్యత్‌పై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### పంట నష్టపరిహారం, శాస్త్రీయ సర్వేకు రైతుల డిమాండ్

పోలవరం ప్రాజెక్టు కారణంగా ఇప్పటికే పలుమార్లు ముంపు భయాందోళనలు ఎదుర్కొంటున్న రైతులు, ఈ సారి అధికారుల పర్యటనపై ఆశలు పెట్టుకున్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాలను శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేసి, వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని కోరుతున్నారు. అలాగే ముంపు వల్ల నష్టపోయే వ్యవసాయ భూములకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే పంట నష్టపరిహారం, పునరావాస చర్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి వరద సీజన్‌లో భయాందోళనలకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయాలు

క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ఆధారంగా సీడబ్ల్యూసీ అధికారులు సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదిక ఆధారంగా ముంపు నివారణ చర్యలు, రక్షణ వ్యవస్థలు, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నారు.

# మూలన పడిన ఆర్ఓ ప్లాంట్లు..!



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆరోఓ ప్లాంటు గత కొన్ని నెలలుగామూలన పడి నిరుపయోగంగా మారడంతో సమీపంలోని ప్రజలు శుద్ధి జల మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరో ప్లాం టు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై మూలను పడి లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆరో ప్లాంట్ నిర్వహణ లోపంతో మూలన పడిపోయింది. సుజలాం మంచినీటి ఆరోఓ ప్లాంట్ తక్కువ ధరకు పేద ప్రజలకు అందించేందుకు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించారు కానీ ప్రైవేటు వ్యక్తులు కి ఇచ్చి కొన్ని సంవత్సరాలు పాటు నిర్వహించారు. కానీ నిర్వహణలో లోపం వలన మంచి నీరు స్థానికంగా ఉన్న కార్యాలయాలకు ప్రజలకు అంధక ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని ఐకెపి ఉపాధి హామీ రైతు వేదిక ఎంపీడీవో కార్యాలయం తాసిల్దార్ కార్యాలయం తదితర కార్యాలయాలకు ప్రభుత్వం తరఫున సుజలాం మంచినీటి పథకం ఈ కార్యాలయాలు కు మరియు స్థానికంగా ఖాన్ ఖాన్ పేట, అంబేద్కర్ నగర్, శాంతినగర్ తదితర నగరవాసులకు అందించేందుకు లక్ష్యంగా ఆరో ప్లాంటు కొన్ని సం వత్సరాలు క్రితం ప్రారంభించారు. నిర్వహణలో లోపం నిర్లక్ష్యం వలన మూలన పడి యంత్రాలు తుప్పు పడుతున్నవి. అధికారులు ఆలోచించి తగులు చర్యలు తీసుకొని ఆర్ఓ ప్లాంటును వినియోగంలోకి తీసుకొని రావాలని ప్రజలు స్థానిక అధికారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. లేనిచో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తామని ప్రజలు తెలుపుతున్నారు.

## ఈవిఎం గోదాము వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈవిఎం గోదాముల వద్ద భద్రత అత్యంత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకి త్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం గోదాము ఆయన పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్ష్యంలో సీల్ తెలిచి గోదాములోనికి ప్రవేశించారు. ఈవిఎంలు, వివి ప్యాట్లు భద్రపరిచిన గదులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, గోదాము వద్ద పటిష్టమైన భద్రత ఉండాలన్నారు. అనంతరం సిసి కెమేరాల పనితీరును పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు లక్ష్మ ణ అగ్రవాల్, మోహన్ కృష్ణ, అనుదీప్, రాంబాబు, ఎన్నికల విభాగ సిబ్బంది నవీన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వం అం దించిన యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు కే సతీష్ సూచించారు నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల రైతుల కు పంపిణీ చేసిన వ్యవసాయ యంత్ర పరికరాల ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించినట్లు తెలిపారు రైతులు వాటిని వినియోగించుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని సూచించారు. రైతులకు అవసరమైన జీలుగులు జనము పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై సొసైటీల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పంట మార్పిడి అలవర్చుకోవాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు రసీదు లేకుండా ఏది కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎం.రాధ, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గాలి వానకు ఇంటిపై విరిగిపడ్డ భారీ వృక్షం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని వినోబానగర్ గ్రామంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి ఓ భారీ చింతచెట్టు విరిగి సిరికొండ లక్ష్మి ఇంటిపై పడడంతో ఓ ఇల్లు తీవ్రంగా దెబ్బతింది. వినోబానగర్ గ్రామానికి చెందిన సిరికొండ లక్ష్మి ఇంటి సమీపంలో ఉన్న భారీ చింతచెట్టు ఒక్కసారిగా విరిగి ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎవరికి ఎలాంటి గాయాలు, ప్రాణనష్టం జరగలేదు. అయితే భారి చెట్టు ఇంటిపై పడడంతో ఇంటి పైకప్పు, గోడలు, రేకులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి తగిన ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

## వైద్య చికిత్స కోసం రూ.3.50 లక్షల ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం

**ప్రజాపక్షం/మణుగూరు:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు మండలం భాస్కర్ నగర్‌కు చెందిన రాయల వీరాంజనేయులకు రూ.3 లక్షల 50 వేల విలువ గల ఎల్ ఓసీ (ఎల్‌ఓసి) పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు దూరం కాకుండా ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాయల వీరాంజనేయులకు అవసరమైన వైద్య చికిత్స కోసం రూ.3.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు కావడం సంతోషకర విషయమని, ఈ సహాయం వారి కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, నియోజకవర్గంలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.